క్లుప్తంగా

ఎంఈవో నాగయ్య సేవలు అభినందనీయం



దుర్గి: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తారని ఎంఈవో–2 బెంజిమెన్ అన్నారు. గురువారం రిటైర్డ్ ఎంఈవో వేముల నాగయ్య సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో ఎంతో దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సైతం రాత్రింబవళ్లు పుస్తకాలు చదివి మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తారన్నారు. రిటైర్డ్ ఎంఈవో వేముల నాగయ్య సేవలను కొనియాడారు. పలువురు ఎస్టీయూ నాయకులు వేముల నాగయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



పిడుగురాళ్ల: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి మోదీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ అన్నారు. బంద్ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ... దేశంలో విద్యారంగం భ్రష్టు పట్టిందని, పేపర్ లీకులు, స్కామ్‌లతో దేశం పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకైందని బిహార్ రాష్ట్ర సిట్ తేల్చిందని, లీకైనట్లు నిందితులు అంగీకరించారని తర్వాత కూడా కేంద్రం విచారణ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డి.అమూల్య, విక్రమ్, మణి, రోహిత్, సత్తి, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

మాచర్ల : పట్టణంలోని ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌లో ఆర్యవైశ్య సంఘ నాయకులు యలమంద, పలు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ 400 మందికి ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని క్యాంటిన్ ద్వారా కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్, చంటి, వై.సురేష్, పోలా సత్యం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మాచర్ల: నియోజకవర్గంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలకు సంబంధించి అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొత్తా చిన్నశ్రీనివాసరావు ఎంపికైనట్లు మాజీ పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి గురువారం తెలిపారు. కోదండరామాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేషన్‌కు కొత్తా చిన్న శ్రీనివాసరావును అధ్యక్షుడిగా ఎంపికై నట్లు ప్రకటించారు. నూతనంగా పెస్టిసైడ్స్, సీడ్స్ షాపుల యజమానులతో చర్చించి నూతన కార్యవర్గాన్ని త్వరలో సమావేశం ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఎంపికైన అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కలిసి అసోసియేషన్ ఎన్నికల విషయాలను తెలియజేసి, ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక



పిడుగురాళ్ల: మిస్సింగ్ బాలికను తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉంటున్న పుణ్యాల చంద్రారెడ్డి కుమార్తె పుణ్యాల నూతన చైత్ర ఆడుకుంటూ ఎంత సేపటికీ ఇంటికి రాకపోయే సరికి తల్లిదండ్రులు ఇంటి పక్కన వారిని విచారించి, పాప కనిపించకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి ఇంటిని పరిశీలించి పట్టణంలో గాలించి పాపను గుర్తించారు. వెంటనే పాపను తల్లిదండ్రులకు ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ అప్పగించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో శంకర్‌రావు, సిబ్బంది

రెంటచింతల: దేశ స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర ఎంతో కీలకమైందని ఆయన పోరాటస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయలో ఆమె ఎంపీడీవో పెదప్రోలు శంకర్ రావు, సిబ్బందితో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి బ్రిటీష్ వారిపై పోరాడారని వారిని స్మరించుకోవడం జాతి ఎప్పటికీ మరవకూడదన్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి మాణ్యం కాలనీలో నున్న ఎంపీయూపీ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడానికి అల్లూరి సీతారామరాజు బ్రిటీషువారిపై పోరాడి ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.బాల చిన్నమ్మ, నాగేశ్వరరావు నాయక్, ఏపీవో జయచంద్రకుమార్, మండల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, అర్చకులు మారుతీశర్మ



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో సరోజనీదేవి

మహానుభావులను స్ఫూర్తిగా తీసుకోవాలి

మాచర్ల : పట్టణంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మాచర్ల ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు, స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ అల్లూరి, పింగళి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొప్ప త్యాగశీలి, దేశ భక్తుడు అల్లూరి అని స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి, అల్లూరి జయంతి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. పలువురు పేదలకు సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి పోలిశెట్టి పుల్లారావు, షేక్ చిన్నలాలూసాహెబ్, రామచంద్రరావు, రామయ్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు మరువలేనివి

మాచర్ల రూరల్: స్వాతంత్య్ర ఉద్యమంలో విప్లవ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన సాహస పోరాటాలు, త్యాగాలు నేటి జాతి మరువలేనిదని ఎంపీడీవో సరోజనీదేవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్వర్గీయ అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో గిరిజనుల హక్కుల కోసమే కాకుండా సామాన్య ప్రజల రక్షణ కోసం 20 ఏళ్ల యుక్త వయసులోనే తెల్లదొరలపై సాయుధ యుద్ధం చేసి అమరుడైన ఆయన సేవలు ఎనలేనివన్నారు. మన్యంలో బ్రిటీషు వారికి కంటి మీద కునుకు లేకుండా రెండు సంవత్సరాల పాటు స్వాతంత్య్ర ఉద్యమాన్ని నడిపిన విప్లవ నేత అల్లూరి అని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆవుల వెంకట్రామయ్య, బిట్టు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సర్పంచ్ బ్రహ్మనాయుడు, బాలునాయక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్‌దాస్

ప్రజల హృదయాలలో కొలువైన నాయకుడు వంగవీటి



దుర్గిలో రంగా విగ్రహానికి నివాళి



కేక్ కట్ చేస్తున్న కాపు జేఏసీ నాయకులు



పెదకొదమగుండ్లలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దుర్గి: పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా అని పలువురు నాయకులు కొనియాడారు. గురువారం మండల కేంద్రమైన దుర్గిలో రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రంగా తన తుది శ్వాస వరకు పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడ్డారన్నారు. ఆయన చనిపోయి 36 సంవత్సరాలు గడిచినా ప్రజల హృదయాలలో ఉన్నారన్నారు. నేటి నాయకులు ప్రజా సేవలో రంగాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జోహార్ రంగా అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కటకం రామారావు, రాజానగర్ సర్పంచ్ జక్కా రమేష్, జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు యేచూరి సాయి శంకర్, రామారావు, లింగా రమేష్, సూరే వెంకటేశ్వర్లు, భీమా, అమరయ్య, కోరె నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, వెలిదండి గోపాల్, సూరే సుబ్బారావు, ధర్మవరం మాజీ సర్పంచ్ ఆకుల లక్ష్మణ్, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ, కాపు నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో వంగవీటి జయంతి వేడుకలు

గురజాల: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అక్షయ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో గురువారం కాపు జేఏసీ ఆధ్వర్యంలో వంగవీటి రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు కటకం అంకారావు మాట్లాడుతూ కాపులు ఎంతో గర్వంగా చెప్పుకునే వ్యక్తి వంగవీటి రంగా అని అన్నారు. ఈ సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ఆశ్రమ నిర్వాహకురాలు మల్లీశ్వరికి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, శరమాళ్ల హనుమంతరావు, చలవాది నారాయణ, జక్కా రవిబాబు, సోలసా కిషోర్, పెద్దోడు, దుర్గారావు తదితరులున్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

కారెంపూడి: స్వర్గీయ వంగవీటి మోహన రంగా జయంతిని అభిమానులు కారెంపూడిలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ, జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే పెదకొదమగుండ్ల గ్రామంలో కూడా అభిమానులు రంగా విగ్రహం వద్ద జయంతిని ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాలలో కూడా అభిమానులు, నాయకులు ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కామేపల్లి హెచ్‌డబ్ల్యూసీ ఆకస్మిక తనిఖీ



పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి గ్రామంలోని హెచ్‌పీడబ్ల్యూసీ (హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రం)ను ఎన్క్యూఎస్ కేంద్రం బృందం సందర్శించి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ అనుప్, డాక్టర్ సీకే ఆఫ్జల్ హెచ్‌డబ్ల్యూసీని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. అలాగే సబ్ సెంటర్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. జిల్లా క్వాలిటీ టీం మెంబర్స్ డాక్టర్ చైతన్య, డాక్టర్ రాం ప్రసాద్, కరాలపాడు పీహెచ్‌సీ డాక్టర్ కేవీ ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన గుబిలి నరసింహారావు గురువారం పలకలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఆయన ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జొన్న విత్తనాలు

కారెంపూడి: పాడి రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తామని అవసరమైన రైతులు తీసుకెళ్లాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం పశుగ్రాసానికి పనికివచ్చే వెయ్యి కిలోల జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 5 కిలోల విత్తనం వరకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మనసు పెట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీ శైలజ

సత్తెనపల్లి: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి మనసు పెట్టాలని ఎంసీఆర్‌పీ శైలజ పేర్కొన్నారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. డీబీఆర్సీ రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. శైలజ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని బట్టి పంటలు మార్పిడి చేయాలని సూచించారు. ప్రత్తి పంటలో కందులు, బెండ విత్తనాలు నాటితే పురుగు, తెగులు ఆశించకుండా ఉంటుందన్నారు. మిర్చి పంట వేసే రైతులు పంటకు రక్షణగా చేను చుట్టూ ఆముదం, కందులు వేసుకోవాలని, పంటలు ఎప్పుడు తూర్పు పడమర మాత్రమే సాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సూర్యోదయం, అస్తమయాల్లో సూర్యరశ్మి మొక్కవేళ్లకు తగిలితే పురుగు ఆశించదన్నారు. ప్రకృతి సిద్ధంగా పంటలు పండించినట్లయితే ఆరోగ్యంవంతంగా ఉంటాయని, ఆ దిశగా రైతులందరూ వ్యవసాయం కొనసాగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవే ప్రాణం సేవ జీవితం సంస్థ ప్రతినిధి నందిగామ నాగేశ్వరరావు, మహిళా రైతులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



తాళ్ళపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

మాచర్ల రూరల్: వ్యాధుల సీజన్ మొదలైంది. గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యంతో ప్రజలు మంచాన బారిన పడుతున్నారు. 'పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం' పేరుతో బుధవారం 'సాక్షి' దిన పత్రికలో కథనం వెలువడటంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లో చెత్తను ఏరివేసి, కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టారు. ప్రజలకు అంటు రోగాలపై అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి పనులను పర్యవేక్షిస్తున్నట్లు వెంకట్రామయ్య తెలిపారు.

ఉద్యాన పంటలకు ఉపాధి హామీ చేదోడు



ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తున్న ఎంపీడీవో సరోజనీదేవి

మాచర్ల రూరల్: ఉద్యానవన పంటలకు ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తున్నామని, వీటిపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఎంపీడీవో సరోజనీదేవి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథక నిధులను పండ్ల తోటల పెంపకాలకు అందించటం శుభపరిణామమని, వీటి ద్వారా పండ్ల తోటలు నిమ్మ, దానిమ్మ, కొబ్బరి జీడి మామిడి, మునగ, పూల తోటలు గులాబి, బంతి, మల్లె, చామంతులు వంటి వాటిపై సబ్సిడీ రుణాలు అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించి పండ్ల, పూల తోటల పెంపకం కోసం ప్రోత్సహించాలని కోరారు. సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ జాబ్ కార్డులు పొంది పొలంలో నీటి వసతి కల్పించుకుని మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని ఉపాధి హామీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, హార్టీకల్చర్ అధికారులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు. వీటిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఏపీవో శ్రీనివాస్, జేఈ గోపి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

మాచర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి దశదిన కర్మను పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ క్యాంపును తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పోతిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ పార్టీ నాయకులు, పెద్దల పేరుతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. గ్రామాభివృద్ధిలో వెంకటేశ్వరరెడ్డి చేసిన సేవలు, ఆయన గుర్తుగా వారి కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్న వారికి అండగా ఉండేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 50 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పోతిరెడ్డి సుజాత, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి కోటిరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకట నాగిరెడ్డి, హనిమిరెడ్డి, కొండలు, బాలిరెడ్డి, పున్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

పునీత థామస్ అడుగుజాడల్లో నడవాలి

ఫాదర్ మాల్లై పవిత్రన్



అతి పురాతన పునీత థామస్ చర్చి

తుమృకోట(రెంటచింతల): క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ పునీత థామస్ క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడిచి సమాజంలో నిజమైన క్రైస్తవులుగా జీవించాలని పునీత థామస్‌వారి చర్చి విచారణ గురువులు మాల్లై పవిత్రన్ అన్నారు. గురువారం తుమృకోట గ్రామంలోనున్న పునీత థామస్‌వారి చర్చి 124వ వార్షికోత్సవం పురస్కరించుకుని విచారణ గురువులు మాల్లై పవిత్రన్ ఆధ్వర్యంలో కర్నూల్ ఫాదర్ ఏసుబాబుతో కలిసి సమిష్టి దివ్యపూజాబలి సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోనే తుమృకోట చర్చి అతి పురాతనమైందన్నారు. అపోస్తులు 12 మందిలో ఒకరైన థామస్ భారతదేశంలో మొట్టమొదటిసారి క్రీస్తు సువార్తను ప్రచారం చేశారని గుర్తు చేశారు. ప్రతి క్రీస్తు ఆరాధికులు ఇరుగు పొరుగు వారి పట్ల ప్రేమ, దయ, కరుణ, జాలి కలిగి సమాజంలో మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు పులిహోరను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు అశోక్, మల్లి, దుగ్గింపూడి శౌరి రాయపురెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి



రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాచర్ల: మాజీ సీఎం స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రోశయ్య కాంస్య విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలూరి నరసింహారావు, మారం వాసు, పోలా శ్రీనివాసరావు, కొత్తమాసు బ్రహ్మరావు, ఆర్యవైశ్య యువజన అధ్యక్షుడు అమర్, సురేష్‌నంద, రంగా పుల్లారావు, రోశయ్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు కె.సైదయ్య, మారం ప్రసాద్, కంభంపాటి అనిల్, కంభంపాటి చంటి, తదితరులు రోశయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. రోశయ్య సేవలను పలువురు కొనియాడారు. సురేష్, శ్రీనివాసరావు, క్రాంతికుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను ఒకసారి చూడరూ...!



రెంటచింతల బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

రెంటచింతల: రెంటచింతలలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ఒకసారి చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. పలువురు గుట్కాలు, ఖైనీలు వేసుకుని ఉమ్మడంతో బస్టాండ్ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. ప్రయాణికులు కుర్చోవడానికి ఏర్పాటు చేసిన షెడ్‌ల్లో కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు ఆటోవాలాలు బస్టాండ్ ముందు ఆటోలను నిలుపుదల చేస్తుండటంతో పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్‌ల కోసం ఎక్కడ వేచి ఉండాలో కూడా తెలియని పరిస్థితి నెలకొనడంతో రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ప్రయాణికులకు బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేయాలని వారు కోరుతున్నారు.